# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025






### పంటల్లో తెగుళ్ల బెడద
పంటలను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను కేవీకే కోఆర్డినేటర్ వివరించారు. IIలో



### అర్హులకే డీసీసీ పదవి
అర్హులైన వారికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి దక్కుతుందని ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహం పేర్కొన్నారు. IIలో




### వాతావరణం
జిల్లాలో శుక్రవారం మధ్యాహం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. ఆ తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### వైభవంగా రామయ్య కల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారికి గురువారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

### పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**పాల్వంచరూరల్:** పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర పూజలు జరిపారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, అర్చకులు, వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ పాల్గొన్నారు.

### నేడు మంత్రి తుమ్మల పర్యటన
**దమ్మపేట:** అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెంలో ఉన్న ఆయిల్ ఫెడ్ నర్సరీని నేడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల సందర్శించనున్నారని పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపాటి ప్రసాద్ కోరారు. గురువారం మండలంలోని అల్లిపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పామాయిల్ మొక్కలకు తెగుళ్లు, అంటువ్యాధులు సోకకుండా మొక్కదశ నుంచే నర్సరీలో చేపట్టే చర్యల కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభిస్తారని అన్నారు. రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు దొడ్డా ప్రసాద్, కేవీ, అడపా రాంబాబు, మన్నెం అప్పారావు పాల్గొన్నారు.

### 'ఎర్త్ సైన్సెస్'కు మన్మోహన్ సింగ్ పేరు
**రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానం**

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెంలో ఇటీవల ప్రారంభమైన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెడుతూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో తీర్మానించారు. సుమారు 300 ఎకరాల్లో రూపుదిద్దుకొంటుండగా, ఇక నుంచి మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా కొనసాగనుంది. ఉమ్మడి జిల్లాలో ఉన్నత విద్యావకాశాలను విస్తృతం చేయడంతోపాటు రాష్ట్రానికి కొత్త దిశను చూపించనున్న యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు దీపావళి బోనస్
**ఒక్కో కార్మికుడికి రూ.1.03 లక్షలు చెల్లించనున్న సింగరేణి**

**కొత్తగూడెంఅర్బన్:** సింగరేణి కార్మికులకు నేడు దీపావళి బోనస్ అందనుంది. ఏటా యాజమాన్యం పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు(పీఎల్ఆర్) బోనస్‌ను దీపావళి ముందు అందజేస్తుంది. ఈసారి ఒక్కో కార్మికుడికి రూ.1.03 లక్షలు ఇచ్చేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమకానుంది. కాగా ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకూ బోనస్ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 20న దీపావళి సందర్భంగా యాజమాన్యం చెల్లింపు సెలవుగా ప్రకటించింది. 20న అన్నీ గనులు, విభాగాలు బంద్ ఉండనుండగా, చెల్లింపు సెలవు రోజుగా ప్రకటించి అత్యవసర కార్మికులకు మాత్రం మూడు రెట్ల వేతనం చెల్లించనున్నారు. పీఎల్ఆర్ బోనస్ 2023లో రూ.85,500, 2024లో రూ.93,750 చెల్లించారు. ఈ ఏడాది రూ. 9,250 పెంచి ఒక్కో కార్మికుడికి రూ.1,03,000 చెల్లించనున్నారు.

# ఇదేమి దారిద్ర్యం?


గోదావరి తీరంలో ఇసుక లారీల వల్ల పాడైన పంచాయతీరాజ్ రోడ్డు

**ఇసుక వాహనాలతో రహదారులు ఛిద్రం**
- పూడికతీత పేరుతో జిల్లాలో 20 రీచ్‌ల ఏర్పాటు
- గోదావరి తీరం నుంచి జోరుగా సాగుతున్న రవాణా
- భారీ వాహనాలతో పాడవుతున్న పీఆర్, ఆర్అండ్‌బి రోడ్లు
- ప్రజల ఇబ్బందులు పట్టించుకోని టీజీఎండీసీ అధికారులు

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** గోదావరి నదీ గర్భం నుంచి కోట్లాది క్యూబిక్ మీటర్ల ఇసుకను అమ్మడంపై ఉన్న శ్రద్ధ, ఆ ఇసుకను తరలించేందుకు అనుసరించాల్సిన విధానంపై లేకపోవడం ఏజెన్సీ వాసులకు కష్టాలు తెచ్చి పెట్టింది. నదీతీర ప్రాంతంలో నివాసమనేది దైన్యంగా మారింది.

**ఇసుక తోడేస్తున్నారు**

నిర్మాణమే జరగని సీతమ్మ సాగర్ బరాజ్ ఎగువ భాగంలో పూడిక తీత పేరుతో 2.20 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వి తీసేందుకు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) అనుమతులు జారీ చేసింది. ఈ ఇసుకను తరలించేందుకు చర్ల, అశ్వాపురం, మణుగూరు, పినపాక, దుమ్ముగూడెం మండలాల పరిధిలో 20 ఇసుక రీచ్‌లను గుర్తించింది. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ కూడా చకచకా జరిగిపోయింది. ఇసుక తవ్వకాలు కూడా జరుగుతున్నాయి. ఇక్కడ ఇసుక అమ్మడం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ. 2,000 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని అంచనా. అమ్మకాల వ్యవహారం మొత్తం పర్యవేక్షిస్తున్న టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యం జిల్లా వాసులకు కష్టాలు తెచ్చి పెట్టింది. ఇసుక తరలించేందుకు వీలుగా రోడ్లను అభివృద్ధి చేయకుండానే అమ్మకాలు మొదలు పెట్టడంతో జిల్లాలోని రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి.

**రోడ్ల సామర్థ్యం ఇలా..**

గ్రామాలను కలిపే పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణంలో ముందుగా అడుగు మందంతో కంకర వేస్తారు. ఆ తర్వాత 30 ఎంఎం మందంతో బీటీ వేస్తారు. రోజుకు రెండు వందల వాహనాలు తిరగడం, 40 టన్నుల బరువు తట్టుకునే సామర్థ్యంతో ఈ రోడ్లను నిర్మిస్తారు. ఆర్అండ్‌బీ రోడ్ల విషయంలో ఒకటిన్నర అడుగు వంతున కంకర వేస్తారు. ఆ తర్వాత 30 ఎంఎం, 50 ఎంఎం వంతున బీటీ వేస్తారు. ఈ రోడ్లు పరిమిత సంఖ్యలో హెవీ వెహికల్స్ తిరిగేందుకు అనువుగా ఉంటాయి. ఇక జాతీయ రహదారుల విషయానికి వస్తే కనీసం రెండు అడుగులకు తక్కువ కాకుండా కంకర వేస్తారు. ఆ తర్వాత 30 ఎంఎం ప్లస్ 30 ఎంఎం ప్లస్ 50 ఎంఎం వంతున బీటీ వేస్తారు. ఈ రోడ్లు అపరిమిత సంఖ్యలో భారీ వాహనాలు తిరిగేందుకు అనువుగా ఉంటాయి.

**రోడ్లు విస్తరించరా?**

జిల్లాలో సింగరేణి సంస్థ వందేళ్లకు పైగా మైనింగ్ చేస్తోంది. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద ఆ సంస్థ చెల్లించే రాయల్టీతో జిల్లా వ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇసుక అమ్మకాల ద్వారా టీజీఎండీసీకి వేలాది కోట్లు ఆదాయం వస్తున్నా కనీసం ఇసుక రవాణా చేసే రోడ్లను అభివృద్ధి చేయడం పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. కేవలం ఇసుక అమ్ముకోవడం, సొమ్ములు చేసుకోవడం మా పని, రోడ్లు ఎలా ఉంటే మాకేంటనే విధంగా టీజీఎండీసీ అధికారుల తీరు ఉంది.

**సామర్థ్యానికి మించిన బరువుతో**

ప్రస్తుతం గోదావరి తీరం నుంచి ఆర్అండ్‌బీ వరకు ఇసుక లారీలు తిరిగే రోడ్లన్నీ పంచాయతీరాజ్ ఆధీనంలో ఉన్నాయి. ఇవి భారీ వాహనాలు తిరిగేందుకు అనువుగా లేవు. ఇక గోదావరి తీరం వెంబడి ఉన్న చర్ల – భద్రాచలం, పినపాక – కృష్ణసాగర్ క్రాస్‌రోడ్ రోడ్లు ఆర్ అండ్ బీ పరిధిలో ఉన్నాయి. ఇవి కూడా పరిమిత సంఖ్యలో హెవీ వెహికల్స్ తిరిగేందుకు అనువైన రోడ్లు. ఇలాంటి రోడ్ల మీద కనీసం యాభై టన్నుల బరువు (35 టన్నుల ఇసుక , 15 టన్నుల బాడీ వెయిట్)తో లారీలు ప్రతీ రోజు వందల కొద్దీ తిరుగుతున్నాయి. దీంతో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అడ్డుకుంటున్న బాధితులు**

ములుగు జిల్లాలో ఇసుక లారీల వల్ల రోడ్లు తీవ్రంగా పాడైపోవడంతో ఆ జిల్లా అధికారులు ఇసుక లారీల రాకపోకలపై ఆంక్షలు విధించారు. దీంతో ఇసుక లారీల ట్రాఫిక్‌ను భద్రాద్రి జిల్లా మీదుగా మళ్లించారు. ఇక్కడ కూడా అవే సమస్యలు వస్తున్నాయి. ఈ నెల ఆరంభంలో ఇసుక లారీల వల్ల చర్ల, మణుగూరు, దుమ్ముగూడెం మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల మణుగూరులో టీజీఎండీసీ ప్రాజెక్టు అధికారి శంకర్‌నాయక్‌ను బాధితులు నేరుగా ప్రశ్నించారు. చివరకు ఇసుక లారీలను అడ్డుకునేందుకు ఎక్కడిక్కడ ప్రజలు సిద్ధమయ్యారు. పరిస్థితి ముదురుపాకన పడుతుండటంతో వర్షాలను సాకుగా చూపుతూ పర్మిట్ల జారీని టీజీఎండీసీ తగ్గించింది. దీంతో గడిచిన నాలుగు రోజులుగా ఇసుక లారీల సందడి తగ్గింది.


మణుగూరులో టీజీఎండీసీ పీవో శంకర్ నాయక్‌ను ప్రశ్నిస్తున్న స్థానికులు(ఫైల్)

# పత్తి రైతుకు 'కపాస్' కష్టం




- కొత్తగా కపాస్ కిసాన్ యాప్ తీసుకొచ్చిన సీసీఐ
- యాప్‌లో రైతు స్లాట్ బుక్ చేస్తేనే కొనుగోళ్లు
- స్మార్ట్ ఫోన్లపై కర్షకులకు అవగాహన లేమి
- ఏజెన్సీ ప్రాంతాల్లో అందని సెల్‌ఫోన్ సిగ్నల్స్

**బూర్గంపాడు:** పత్తి రైతును సీజన్ ప్రారంభం నుంచీ సమస్యలు వెంటాడుతున్నాయి. సకాలంలో వర్షాలు కురవక, ఆ తర్వాత అధిక వర్షాలు రావడంతో పంటలు దెబ్బతిన్నాయి. అన్నింటినీ అధిగమించి చేతికొచ్చిన అరకొర పంటను అమ్మాలంటే సీసీఐ తెచ్చిన కపాస్ యాప్ ఆందోళనకు గురిచేస్తోంది. పత్తి కొనుగోళ్లలో దళారుల ప్రమేయం నివారించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను తెచ్చింది. సీసీఐలో పత్తి విక్రయించాలంటే రైతులు తప్పనిసరిగా ఆండ్రాయిడ్ ఫోన్‌లో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్ నంబర్ ఆధారంగా వచ్చే ఓటీపీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫోన్, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల నంబర్, భూముల సర్వే నంబర్, విస్తీర్ణం తదితర వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలి. పంట విక్రయించే సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎన్ని క్వింటాళ్ల పత్తి అమ్మకానికి తెస్తున్నారు, తేమశాతం ఎంత? తదితర వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత స్థానిక వ్యవసాయ అధికారులు ఎప్పుడు, ఎక్కడకు తీసుకురావాలనే వివరాలను స్లాట్‌లోనే వెల్లడిస్తారు.

**రైతుల్లో ఆందోళన**

కపాస్ యాప్ విధానం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. చాలామంది రైతులకు ఆండ్రాయిడ్ ఫోన్లు లేవు. ఉన్నా ఆ ఫోన్ నంబర్, పట్టాదారు పాసు పుస్తకంతో లింకై ఉండాలి. లేకుంటే యాప్‌లో రిజిస్ట్రేషన్ కాదు. ఆధార్‌కార్డుతో అయినా చాలావరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులువవుతుంది. కానీ కపాస్ కిసాన్ యాప్‌లో ఫోన్ నంబర్ కీలకంగా మారింది. పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చినప్పుడు ఏ ఫోన్ నంబర్ ఉందో అదే నంబర్‌తో యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. స్లాట్ బుక్ చేసుకున్నాక మూడుసార్లు కేటాయించిన తేదీల్లో పత్తి తీసుకురాకుంటే వారు ఆటోమేటిక్‌గా బ్లాక్ లిస్ట్‌లో చేరతారు.

**ఏజెన్సీలో సిగ్నల్ సమస్య**

జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఎక్కువగా పత్తి సాగు చేస్తున్నారు. వీరిలో చాలామందికి స్మార్ట్ ఫోన్ల వినియోగం తెలియదు. యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియలపై అవగాహన లేదు. కొందరికి ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగం తెలిసినా సిగ్నల్ సమస్య ఎదురవుతుంది. క్రాప్‌బుకింగ్ సమయంలో సిగ్నల్స్ అందక వ్యవసాయశాఖ అధికారులే ఇబ్బందులు పడుతున్నారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో మండల కేంద్రాలు, మార్కోడు గ్రామానికి తప్ప మిగతా గ్రామాల్లో సిగ్నల్స్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండవు. కరకగూడెం, పినపాక, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాల్లోని మారుమూల అటవీ గ్రామాల్లో కూడా సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా రావు. ఆయా గ్రామాల రైతులు చిన్న ఫోన్‌లనే వినియోగిస్తున్నారు. ఇప్పుడు పత్తి అమ్మకాలకు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే వారు స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేయాలి. స్మార్ట్ ఫోన్‌ను వినియోగించుకోవాలంటే సిగ్నల్స్ వచ్చే ప్రాంతాలకు రావాలి. ఇన్ని గందరగోళ పరిస్థితుల్లో సన్న, చిన్నకారు రైతులు మళ్లీ స్థానికంగా ఉన్న దళారులను, వ్యాపారులను ఆశ్రయించే అవకాశాలున్నాయి. ఇక కౌలురైతులు పత్తిని అమ్ముకోవాలంటే ముందుగా పట్టాదారు రైతు నంబర్‌తో యాప్‌లో లాగిన్ కావాలి. ఆ తర్వాత వ్యవసాయ శాఖ అధికారులు కౌలు రైతు వివరాలను యాప్‌లో నమోదు చేసి పట్టాదారుకు అనుసంధానం చేస్తారు. ఈ ప్రక్రియలో కౌలు రైతుల కష్టాలు చెప్పనలవి కాదు.

**సిగ్నలే ఉండదు**



సీసీఐకి పత్తి అమ్మాలంటే యాప్‌లో నమోదు చేసుకోవాలంటున్నారు. మా ప్రాంతంలో సెల్‌ఫోన్ సిగ్నలే సరిగా ఉండదు. ఈ కండీషన్లు లేకుండా రైతుల పట్టాదారు పాసుపుస్తకంతో పత్తి పంట కొనాలి. లేకుంటే మేము మళ్లీ ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోకతప్పదు.

– సాంబశివరావు, పత్తిరైతు, పెద్దతోగు, గుండాల మండలం

**అవగాహన కల్పిస్తున్నాం**



దళారుల ప్రమేయం తగ్గించేందుకు సీసీఐ కపాస్ కిసాన్ యాప్ తెచ్చింది. దీనిపై ఇప్పటికే ఏఈఓలకు శిక్షణనిచ్చాం. వారు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు. సాంకేతికంగా కొన్ని ఇబ్బందులున్న వాటిని అధిగమించేందుకు రైతులకు సహకారమందిస్తాం.

– బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# గురుకులాల్లో మౌలిక వసతులు

**కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

**పాల్వంచరూరల్:** గిరిజన విద్యార్థుల సమగ్రాభివృద్ధికోసం మౌలిక వసతులు కల్పిస్తానని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండల పరిధిలోని కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. ప్రిన్సిపాల్, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలకు ప్రహారీ, అదనపు తరగతిగదులు మంజూరు చేస్తామని, క్రీడా మైదానాన్నిఅభివృద్ధి చేస్తామని తెలిపారు. పాఠశాల స్థలం అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాలని, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు టెబుల్ టెన్నిస్ సామగ్రిని అందజేశారు. ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అరుణకుమారి, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ ఎస్.శ్యామ్ కుమార్, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

# జాబ్‌మేళాకు 925 మంది

**సింగరేణి(కొత్తగూడెం):** కొత్తగూడెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. మెరీనా పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 2,190 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించగా 925 మంది హాజరయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు.

# కోర్టు భవనాలకు గ్రీన్ సిగ్నల్

**పదెకరాల విస్తీర్ణంలో అధునాతన నిర్మాణాలు**

**సూపర్‌బజార్(కొత్తగూడెం) :** జిల్లా కోర్టు నూతన భవన సముదాయాల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరడం, అసౌకర్యంగా ఉండటంతో ప్రభుత్వం టెన్ ప్లస్ టూ జిల్లా కోర్టు భవనాలు, పోక్సో అండ్ ఫ్యామిలీ కోర్టుల భవనాల నిర్మాణానికి ఉపక్రమించింది. ఆర్అండ్‌బీ, రాష్ట్ర ఆర్కిటెక్ట్ వింగ్ నుంచి సత్వరమే చర్యలు ప్రారంభమయ్యాయి. కొత్తగూడెం ప్యూన్ బసీ ఏరియా సర్వే నంబర్ 143లోని 10 ఎకరాల స్థలంలో భవనాలు నిర్మించనున్నారు. పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయడం, సాయిల్ టెస్టు, లేఅవుట్ ప్రణాళిక, నిర్మాణ రూపకల్పన కోసం కన్సల్టెంట్ల నియామకానికి ఆర్అండ్‌బీ శాఖ ఇప్పటికే టెండర్ ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియను కొత్తగూడెం ఆర్అండ్‌బీ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పర్యవేక్షించనున్నారు. కోర్టు భవన సముదాయాలు పూర్తయితే జిల్లా న్యాయవ్యవస్థకు ఆధునిక మౌలిక సదుపాయాలు సమకూరనున్నాయి. నూతన భవన నిర్మాణాలకు, స్థల సేకరణకు కృషిచేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు.

# పరీక్షలకు సిద్ధం చేయాలి

**ఐటీడీఏ పీఓ రాహుల్**

**భద్రాచలం:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో హెచ్ఎంలు, వార్డెన్‌లతో సమీక్షా సమావేశం జరిపారు. పాఠశాలల పనితీరు, మౌలిక వసతుల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ముందస్తుగా సిలబస్ పూర్తి చేసి మోడల్ పరీక్షా పత్రాలతో సంసిద్ధులను చేయాలన్నారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పురాతన భవనాలు, పాఠశాలను వివరాలను అందించాలని, అవసరమైనచోట మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమ్మెలో ఉన్న డైలీవేజ్ వర్కర్లు ఈ నెల 20 తేదీలోగా విధుల్లోకి రాకపోతే కొత్తగా వర్కర్లను నియమించుకోవాలన్నారు. ఈ నెల 17,18వ తేదీల్లో డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహించాలని పీఓ మరో ప్రకటనలో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు అశోక్, మధుకర్, సమ్మయ్య, రమేష్, చంద్రమోహన్, భారతీదేవి, అలివేలు మంగతాయారు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ రాహుల్

# బాణసంచా.. భద్రతాచర్యలు

- జిల్లా వ్యాప్తంగా దుకాణాల ఏర్పాట్లు
- మొదలైన అనుమతుల ప్రక్రియ
- ఈసారి ఖర్చు పెరిగిందంటున్న వ్యాపారులు
- ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలుపై దృష్టి


భద్రాచలంలో బాణసంచా దుకాణాల ఏర్పాట్లు

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** దీపావళి పండగ సందర్భంగా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి బాణసంచా విక్రయాలు సాగించే వ్యాపారులు రెవెన్యూ, మున్సిపాలిటీ / గ్రామపంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక, పోలీసు శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో కొత్తగూడెంలో 38, రుద్రంపూర్ 01, రామవరం 04, జూలురుపాడు 02, చంద్రుగొండ 02, ఇల్లెందు 28, మణుగూరు 16, పాల్వంచ 12, భద్రాచలం 8, చర్ల 4, సారపాక 1, బూర్గంపాడు 2, అశ్వారావుపేటలో 16 వంతున షాపుల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనుమతులు వచ్చిన తర్వాత ఎంపిక చేసిన మైదానం/ఖాళీ ప్రదేశంలో దుకాణదారులు తాత్కాలిక షాపులు ఏర్పాటు చేస్తారు. అయితే ఫైర్‌సేఫ్టీ జాగ్రత్తలు పాటించడంలో ఈ దుకాణాల దగ్గర నిర్లక్ష్యం కనిపిస్తుంటుంది.

**పెరిగిన ఖర్చు**

బాణసంచా వ్యాపారులు ఖర్చులు తగ్గించుకునేందుకు కలిసికట్టుగా (సిండికేట్) దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో మండల కేంద్రాల్లో ఒక్కో దుకాణం ఏర్పాటుకు కనిష్టంగా రూ.40 వేలు ఖర్చవుతుండగా పట్టణాల్లో ఇది రూ.60 వేలకు చేరుకుంది. ఇందులో అనుమతుల కోసం వేర్వేరు ప్రభుత్వశాఖలకు చలాన్ల రూపంలో చెల్లించే సొమ్ము రూ.2 వేలలోపు ఉండగా అద్దె రమారమీ రూ.5వేల వరకు ఉంది. షెడ్డు నిర్మాణం , జనరేటర్, విద్యుత్ బిల్లుల ఖర్చు రూ.10 వేల వరకు ఖర్చు వస్తోంది. మొత్తంగా దుకాణం ఏర్పాటుకు రూ. 30వేలకు అటుఇటుగా ఖర్చు వస్తోంది. అయినా ఒక్కో దుకాణం ఏర్పాటు కోసం అదనంగా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ముడుపుల కోసమే అదనపు ఖర్చు చేయాల్సి వస్తోందని వ్యాపారులు అంటున్నారు. పెరిగిన ఖర్చుల ప్రభావం ఫైర్‌సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రతికూల ప్రభావం చూపిస్తోందంటున్నారు.

**అనుమతుల్లో చేతివాటం?**

జిల్లాలో ఓ మున్సిపాలిటీ పరిధిలో బాణసంచా దుకాణం పర్మిషన్ కోసం రెవెన్యూ సిబ్బంది ఒక్కో షాపునకు రూ.5,000 డిమాండ్ చేసినట్టు సమాచారం. అంత ముట్టచెప్పుకోలేమని వ్యాపారులు చెప్పడంతో అనుమతుల ప్రక్రియను సదరు అధికారి తొక్కిపెట్టినట్టు తెలుస్తోంది. దీంతో బాణసంచా సిండికేట్ సదరు అధికారికి ఎదురు తిరిగి అనుమతుల కోసం పైఅధికారి దగ్గరకు వెళ్తామని చెప్పడంతో చివరకు డీల్ రూ.3,000 దగ్గర కుదిరినట్టు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో ఇతర ప్రాంతాల్లోనూ, ఇతర శాఖల్లోనూ ఇవే ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాపారులు అంటున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**
- దుకాణం ఓపెన్ ఏరియాలో అనుమతి పొందిన ప్రదేశంలో ఉండాలి.
- నిర్మాణం క్లాత్ వుడ్ టార్పాలిన్ లాంటి కాలే వస్తువులతో చేయకూడదు.
- నాణ్యమైన వైరుతో ఎలక్ట్రికల్ వైరింగ్ చేయాలి. అతుకులు లేకుండా ఉండే విధంగా క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్‌తో వైరింగ్ చేయించాలి.
- 2 నంబర్ డీసీపీ ఫైర్ ఎక్స్టింగ్విషర్స్ ఉండాలి.
- రెండు వాటర్ బ్యారెల్స్ (ఒకటి 200 లీటర్స్) ఉండాలి.
- స్మోకింగ్ నిషేధం అని బోర్డులు ఏర్పాటు చేయాలి.
- స్పార్క్ వచ్చే ఎలాంటి ఎక్విప్మెంట్ వాడకూడదు.
- 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టకూడదు.
- షాప్‌లో, చుట్టూ ప్రదేశంలో శుభ్రత పాటించాలి.
- రెండు షాప్‌ల మధ్య 3 మీటర్ల గ్యాప్ ఉండేలా చూడాలి.

**నిబంధనలు పాటించాలి**

తాత్కాలిక టపాకాయల దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలి. జాగ్రత్తలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు అందరూ సహకరించాలి.

–మురహరి క్రాంతి కుమార్, జిల్లా ఫైర్ ఆఫీసర్

**హద్దు మీరితే చర్యలు**

అనుమతులు లేకుండా టపాసులను విక్రయించినా, నిల్వ చేసినా చర్యలు తీసుకుంటాం. క్లస్టర్‌లో యాభై షాపులకు మించి ఉండకూడదు. ఇళ్ల మధ్య, కల్యాణ మంటపాలు, సమావేశ మందిరాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయొద్దు.

–అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ, కొత్తగూడెం

## క్లుప్తంగా

### అవే కష్టాలు..

యూరియా కోసం రైతుల పడిగాపులు



యూరియా కోసం పీఏసీఎస్ వద్ద బారులుదీరిన రైతులు

**కరకగూడెం:** యూరియా కష్టాలు రైతులకు మళ్లీ వచ్చాయి. మండల కేంద్రంలోని పీఏసీఎస్ సెల్ పాయింట్‌లో వారం రోజులుగా స్టాక్ రాక రైతులు ఎదురుచూస్తుండగా బుధవారం స్టాక్ వచ్చింది. గురువారం ఒక్కరికి ఒక్క యూరియా కట్ట మాత్రమే ఇవ్వడంతో పెద్ద ఎత్తున రైతులు అక్కడికి తరలి వచ్చారు. ఫలితంగా సెంటర్ వద్ద భారీ రద్దీ, ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎండలో గంటల తరబడి క్యూలో నిలబడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలకు యూరియా వేయడానికి ఇదే సమయం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 'ఎక్స్‌లెంట్' చైర్మన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న యూసుఫ్ షరీఫ్

**మణుగూరురూరల్:** ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండీ యూసుఫ్ షరీఫ్‌కు లీడ్‌ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బెస్ట్ టీచర్ అవార్డ్–2025 లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఎన్ఎస్ఏ సభ్యులు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎం.కొమరయ్య, ఎం.అంజిరెడ్డి, ఏఆర్‌కే గ్రూప్స్ సీఎండీ జి.రామ్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

### గిరిజన విద్యార్థినికి స్వర్ణ పతకం



స్వర్ణ పతకంతో శ్రీతేజ

**కరకగూడెం:** మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గిరిజన క్రీడాకారిణి తోలెం శ్రీతేజ జాతీయస్థాయిలో మెరిసింది. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి హెప్టాథ్లాన్ పోటీల్లో అండర్–20 విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. వివిధ క్రీడాంశాల కలయిక అయిన హెప్టాథ్లాన్‌లో శ్రీతేజ 4,654 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమె గతంలో కూడా రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చూపింది. ఈ సందర్భంగా శ్రీతేజను పలువురు అభినందిస్తున్నారు.

### తల్లిదండ్రులను చూసుకోవాల్సిందే..




మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

**కొత్తగూడెంటౌన్:** తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దని, వారిని చూసుకోవాల్సిన బాధ్యత కుమారులపై ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ అన్నారు. గురువారం కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీసత్యసాయి అనాథ, వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ సందర్శించారు. వృద్ధుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వృద్ధాప్యం శాపం కాదని, వృద్ధులు జ్ఞానం, అనుభవంతో సమాజాన్ని సుసంపన్నం చేయడంలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు.

### 23 నుంచి కార్తీకమాసోత్సవాలు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి నవంబర్ 20 వరకు కార్తీకమాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన ఈఓ దామోదర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని, కార్తీక మాసంలో ప్రతి శని, ఆది, సోమవారాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరుగుతాయని పేర్కొన్నారు. నవంబర్ 10 నుంచి శ్రీరామ పునర్వసు దీక్షలు ప్రారంభమై డిసెంబర్ 8వ తేదీతో ముగుస్తాయని వివరించారు. నవంబర్ 16వ తేదీన గోదావరి నదీహారతిని వైభవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.19,400 |

# పంటల్లో తెగుళ్ల బెడద

- దిగుబడిపై రైతుల్లో ఆందోళన
- యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తల సలహాలు



డాక్టర్ టి.భరత్, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్



బ్యాక్టీరియా ఎండు తెగులు ఆశించిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

**సూపర్‌బజార్ (కొత్తగూడెం):** వాతావరణ పరిస్థితుల్లో రోజుకో రకంగా ఉంటున్నాయి. కొద్దిరోజుల పాటు ఎడతెగకుండా వర్షాలు కురి శాయి. ప్రస్తుతం మధ్యాహ్నం ఎండగా ఉంటున్నా సాయంత్రం మంచుప్రభావం కనిపిస్తోంది. ఈ నేపథ్యాన వివిధ పంటలను తెగుళ్లు ఆశిస్తుండగా దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు వివిధ పంటల్లో తీసుకోవాల్సి న యాజమాన్య పద్ధతులను కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్ వెల్లడించారు.

**వరి**

అధిక తేమతో కూడిన వాతావరణం వరిలో మానుపండు తెగులు సోకడానికి అనుకూలం. ఈ లక్షణాలు కనిపిస్తే ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు 0.4గ్రాములు + ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ టేబుకోన జోల్ లేదా ఒక ఎం.ఎల్. ప్రొపికోనజోల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంటలో పాము పొడ తెగులు లక్షణాలు గమనిస్తే వర్షాలు తగ్గాక ఒక మి.లీ. ప్రొపికోనజోల్‌ను లీటర్ నీటిలో కలిపి 15 రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. అలాగే, వరిలో సుడిదోమ ఆశిస్తే నివారణకు వర్షాలు తగ్గిన తర్వాత 0.6 గ్రాముల పైమెట్రోజిన్ లేదా 0.48 మి.లీ. టిఫ్లోమేజపైరిన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇంకా కంకి నల్లి ఆశిస్తే ఒక మి.లీ. స్పైరోమైసిఫిన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే, బ్యాక్టీరియా ఎండు తెగులు ఉధృతి కనిపిస్తే ఎకరానికి 400 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్, స్టేపీటోమైసిన్ సల్ఫేట్ 60 గ్రాములు అందిస్తూ.. యూరియా మోతాదును తగ్గించి నీటిని తడి – పొడి విధానంలో అందించాలి. అయితే, ఈ తెగులుకు పూర్తిగా నివారించడానికి సరైన మందులు లేవు.

**పత్తి**

ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 2 మి.లీ. ప్రోఫినోఫాస్ లేదా 1.5 గ్రాముల దియోడికార్బ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే, ఎకరానికి 5 – 6 లింగాకర్షణ బుట్టలు అమరిస్తే పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. అలాగే, పత్తిలో కాయకుళ్లు లక్షణాలు గమనిస్తే వర్షాలు తగ్గాక 0.2 గ్రాముల ప్లాంటమైసిన్ + 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి

**అపరాలు**

వెచ్చటి గాలి, అధిక తేమ వాతావరణ పరిస్థితుల్లో కంది, పెసర, మినుము పంటలను మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. ఈ పురుగు ఆనవాళ్లను గమనిస్తే వర్షాలు తగ్గిన తర్వాత నివారణకు ఒక మి.లీ. నోవాలురాన్ లేదా 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి

**కూరగాయలు**

- టమాట పంటలో సూది పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 0.3 మి.లీ. స్పైనోసాడ్ లేదా 0.2 మి.లీ. ఇండాక్సికార్బ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇక వంగలో కొమ్మ, కాయ తులసి పురుగు ఆశిస్తే 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి

# అర్హులకే డీసీసీ పదవి

ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహం



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహం

**మణుగూరు టౌన్/దమ్మపేట:** సంక్షేమ పథకాల విస్తృత ప్రచారం, సమర్థత కలిగిన వారితోపాటు ఆరేళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ కిందిస్థాయి కార్యకర్తల నుంచి పరిచయం ఉన్నవారికే డీసీసీ అధ్యక్ష పదవి లభిస్తుందని ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహం అన్నారు. గురువారం మణుగూరులోని ఇల్లెందు అతిథి గృహంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిపారు. దమ్మపేట మండలం పట్వారిగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. యువతకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య కూడా మాట్లాడారు. అనంతరం ఏఐసీసీ అబ్జర్వర్ ఆశావహుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, పరిశీలకులు సుబ్బారావు, వై. సాగరిక, సంజీవ్ ముదిరాజ్, రాజేందర్‌రెడ్డి, మోతుకూరి ధర్మారావు, నల్లపు దుర్గాప్రసాద్, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, చింతిరాల రవికుమార్, పటాన్ మహ్మద్ ఖాన్, చందా సంతోష్, తాళ్లూరి చంద్రశేఖర్ చక్రవర్తి, దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

# కష్టపడితేనే సమాజంలో గుర్తింపు

అదనపు కలెక్టర్ విద్యాచందన



మాట్లాడుతున్న విద్యాచందన

**పాల్వంచరూరల్:** మహిళలు కష్టపడి పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. మండల పరిధిలోని తోగ్గూడెం తండా, రంగాపురంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోషన్ వాటిక పనులను, నారాయణరావుపేటలోని మహిళల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌బీఐ, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పనులు పూర్తిచేసిన కుటుంబాల సభ్యుల కోసం కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 30 రోజులపాటు శిక్షణ ఇస్తామని అన్నారు. ఎస్‌బీఐ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలకు ముద్ర రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎల్‌డీఎంలు వి.రామిరెడ్డి, వి.రవిప్రసాద్, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ చెన్నకేశ్, ఏపీఓ రంగా తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజానికి పాటుపడదాం



తనిఖీల్లో పాల్గొన్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పోలీసులు

**మణుగూరురూరల్:** మాదకద్రవ్య రహిత సమాజానికి పాటుపడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని సమితిసింగారం గ్రామ పంచాయతీ అశోక్‌నగర్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ నేతృత్వంలో అశ్వాపురం, ఏడూళ్లబయ్యారం సీఐలు అశోక్‌రెడ్డి, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది అశోక్‌నగర్‌లోని ప్రతీ ఇంటిని జాగిలాలతో తనిఖీ చేసి సరైన పత్రాలు లేని, నంబర్ ప్లేట్లు లేని 58 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలు, బెల్ట్ షాపుల్లోని రూ.30 వేల విలువల గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా డ్రగ్స్‌పై యుద్ధం చేపట్టినట్లు తెలిపారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ నగేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తొమ్మిది అడుగుల కొండచిలువ పట్టివేత



కొండచిలువతో స్నేక్ రెస్క్యూ టీమ్

**చుంచుపల్లి:** మండలంలోని రుద్రంపూర్ క్లబ్ ఏరియాలో బుధవారం రాత్రి మోజెస్ ఇంట్లోకి సుమారు 9 అడుగుల పొడవైన కొండచిలువ రావడంతో పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. స్థానికుల సమాచారం మేరకు ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపకుడు, కొత్తగూడెం స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్, సభ్యుడు నారదాసు శ్రీకాంత్‌తో అక్కడకు చేరుకుని కొండచిలువ (ఇండియన్ రాక్‌పైథాన్)ను బంధించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులతో కలిసి అర్ధరాత్రి అడవిలో వదిలేశారు. మదర్ థెరిసా సేవా సంస్థ అధ్యక్షుడు గుడెల్లి యాకయ్య, బండ శంకర్, మురళి, శ్రీనివాస్, సలీం, తరుణ్, ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ కనెక్షన్ల మంజూరు

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకైన రైతులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని, అలాగే వ్యవసాయ సర్వీసుల మంజూరు యుద్ధ ప్రాతిపదికన రిలీజ్ చేస్తున్నామని జిల్లా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గొట్టిముక్కుల మహేందర్ గురువారం తెలిపారు. సర్కిల్ పరిధిలో 2023లో 2,796 విడుదల చేయగా, 2024లో 4,428 సర్వీసులు, 2025 (అక్టోబర్ 16 వరకు) 2,962 విడుదల చేశామని తెలిపారు. ఇంకా మూడు నెలల సమయంలో అధికంగా మంజూరు చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 1912కి ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

### వీఓఏల అరెస్ట్ హేయం

**ములకలపల్లి:** సెర్ప్‌లో విధులు నిర్వర్తిస్తున్న వీఓఏల సమస్యల పరిష్కారానికై కార్యాలయ ముట్టడి చేపట్టినవారిని అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని తెలంగాణ సెర్ప్ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసం కనకలక్ష్మి అన్నారు. ములకలపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. అక్రమ అరెస్ట్‌లను అన్నివర్గాల ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, సంఘం నాయకురాలు దుర్గా, షఫియా, విజయ్, జ్యోతి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వర్క్‌షాప్‌లో నూతన యంత్రం ప్రారంభం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం దామోదరరావు

**కొత్తగూడెంఅర్బన్:** సెంట్రల్ వర్క్ షాప్‌లో అత్యాధునిక ఎల్–45 లేత్ యంత్రాన్ని శుక్రవారం సెంట్రల్ వర్క్‌షాప్ జీఎం (ఈ–ఎం) ఎస్.దామోదరరావు ప్రారంభించి, మాట్లాడారు. రూ.1.45 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఎల్–45 లేత్ మెషిన్ సాయంతో వేగం, కచ్చితత్వంతో కూడిన బొగ్గు ఉత్పత్తి, రవాణాలో వాడే డ్రమ్ము హబ్బులు, ఫ్యాన్ సాఫ్ట్‌లను తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తిని చేయవచ్చని చెప్పారు. కార్యక్రమములో ఏజీఎం (ఈ–ఎం) మెయిన్ వర్క్‌షాప్ పి.రాజీవ్‌కుమార్, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, అప్రెంటిస్ విద్యార్థులు పాల్గొన్నారు.

### తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు

**మణుగూరురూరల్:** బీసీ రిజర్వేషన్ అమలుపై 18న బీసీ సంఘాలు నిర్వహించే తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని పేర్కొన్నారు. బీసీ సంఘాలు చేస్తున్న బంద్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# నకిలీ వే బిల్లుల ముఠా గుట్టురట్టు

ఆరుగురు నిందితుల అరెస్టు.. పరారీలో ముగ్గురు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

**అశ్వాపురం:** నకిలీ వే బిల్లులతో లారీలో ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఆరుగురిని అరెస్టు చేయగా ముగ్గురు పరారీలో ఉన్నారు. గురువారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. జగ్గారంక్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 8న అశ్వాపురం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి.. టీఎస్30టీఏ 6498 నంబర్ గల ఇసుక లోడ్ లారీని ఆపి, పరిశీలించారు. డ్రైవర్ నాతి రాములు చూపించిన వే బిల్లుపై అనుమానం వచ్చి ప్రశ్నించగా అది నకిలీ వే బిల్లు అని, దానిని తమ యజమాని హైదరాబాద్‌కు చెందిన కర్నాటి శివశంకర్ ద్వారా పంపించాడని, రామానుజవరం ర్యాంపులో ఓ వ్యక్తి తనకు డీడీ లేకుండా ఇసుక లోడ్ చేశాడని తెలిపాడు. లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తరువాత పోలీసులు రామానుజవరం ఇసుక ర్యాంపులో తనిఖీ చేయగా అక్కడ పనిచేసే టీజీఎండీసీ ఉద్యోగులు దగ్గు నిఖిల్‌దీప్, నాగేల్లి మధు, బొల్లెద్దు అనిల్ డీడీ లేకుండా అనుమతులు ఇవ్వగా.. జేసీబీ డ్రైవర్ ఇరగదిండ్ల ఉపేందర్ ఇసుక లోడ్ చేశాడని, అతడికి సూపర్‌వైజర్‌గా పనిచేసే సతీశ్‌రెడ్డి ఫోన్ చేసి చెప్పాడని తేలింది. దీంతో హైదరాబాద్ హయత్‌నగర్‌లోని కర్నాటి శివశంకర్ నివాసానికి వెళ్లి విచారించగా.. యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టపాకకు చెందిన కిరణ్ తనకు నకిలీ వే బిల్లులు తయారు చేయడం నేర్పించాడని చెప్పాడు. కిరణ్‌పై 2023లో నకిలీ వే బిల్లులు తయారు చేయగా.. వరంగల్ జిల్లా మట్వాడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదై, జైలుకు కూడా వెళ్లాడని శివశంకర్ పోలీసులకు వివరించాడు. కాగా, కర్నాటి శివశంకర్, నాతి రాములు, ఇరగదిల్ల ఉపేందర్, దగ్గు నిఖిల్‌దీప్, నాగేల్లి మధు, బొల్లేదు అనిల్‌ను అరెస్ట్ చేశామని, కిరణ్, సతీశ్‌రెడ్డి, సుర్వే శ్రీకాంత్ (లారీ ఓనర్) పరారీలో ఉన్నారని డీఎస్పీ వివరించారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు తెలిస్తే అశ్వాపురం ఎస్‌హెచ్ఓ 87126 82093, డీఎస్పీ 87126 82006 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. సమావేశంలో అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### రాళ్లతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

**పాల్వంచ:** గొడవ జరుగుతుందనే సమాచారంతో వెళ్లిన కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి రాళ్లతో దాడికి పాల్పడగా.. గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో డయల్ 100 గొడవ జరుగుతున్నట్లు కాల్ రాగా.. కానిస్టేబుల్ అబ్బురాములు ఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ జట్‌పట్ రమేశ్ మద్యం సేవించి సదరు కానిస్టేబుల్‌తో ఘర్షణకు దిగాడు. అనంతరం రాయితో దాడి చేయడంతో తలకు గాయమైంది. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు రమేశ్‌పై ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత



ఆసుపాకలో పట్టుకున్న బియ్యం వద్ద డీటీ ప్రభాకర్

**అశ్వారావుపేటరూరల్:** పలు ఇళ్లల్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు గురువారం దాడులు చేసి పట్టుకున్నారు. మండలంలోని ఆసుపాక, జమ్మిగూడెం, తిరుమలకుంట, గుమ్మడవల్లి గ్రామాల్లో కొందరు వ్యక్తుల ఇళ్లల్లో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు సివిల్ సప్లై అధికారులకు సమాచారం రావడంతో అధికారులు ఆయా ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో జమ్మిగూడేనికి చెందిన భీమవరపు గంగరాజు ఇంట్లో 9 క్వింటాళ్లు, ఆసుపాక గ్రామానికి చెందిన తాడేపల్లి ఆనందరావు ఇంట్లో 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత వారిద్దరిపై వేర్వేరుగా 6ఏ కేసులు నమోదు చేసినట్లు సివిల్ సప్లై ఇన్‌చార్జ్ డీటీ ప్రభాకర్ తెలిపారు.

# ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీస్ సిబ్బంది

**పాల్వంచ:** పట్టణంలోని శ్రీనివాసగిరి వేంటేశ్వర స్వామి ఆలయంలో హుండీలోని నగదు చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. గత మంగళవారం రాత్రి శ్రీనివాసకాలనీలోని గుట్టపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి, హుండీ తాళాలు పగులగొట్టి సుమారు రూ.3 వేల నగదును చోరీ చేశాడు. అక్కడ పనిచేసే వ్యక్తులకు చెందిన రెండు సెల్‌ఫోన్‌లు, పర్సులోని రూ.1,500 నగదునూ అపహరించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో గురువారం కిన్నెరసాని రోడ్‌లో గుడ్‌మార్నింగ్ హోటల్ వద్ద సదరు వ్యక్తిని గుర్తించిన గుడి సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గతంలో అదే దొంగ ఆలయంలో పలుమార్లు చోరీకి పాల్పడినట్లు సమాచారం.

### యువకుడి ఆత్మహత్య

**కొత్తగూడెంటౌన్:** పట్టణంలోని గౌతంపూర్ కాలనీకి చెందిన శంకువార్ కార్తీక్ (25) మద్యం మత్తులో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రామవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గౌతంపూర్‌కు చెందిన శంకువార్ ప్రకాష్ కుమారుడు కార్తీక్ ఇంటి వద్దనే ఉంటున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన కార్తీక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరాతీశారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ మనీషా తెలిపారు.

**తవిశలగూడెంలో వివాహిత**

**పాల్వంచరూరల్:** భర్తతో గొడవపడిన వివాహిత ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తవిశలగూడెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తవిశలగూడెం గ్రామానికి చెందిన ముద్దసాని పుష్పలత (32) ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న బాదావత్ రమేశ్‌ను మూడేళ్ల కిందట రెండో వివాహం చేసుకుంది. గురువారం దంపతుల మధ్య గొడవ జరిగింది. భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు చింతమళ్ల కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేశ్ తెలిపారు.

### గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం తెల్లవారుజామున హాస్టల్ ఆవరణలో ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. తెల్లవారుజామున సదరు విద్యార్థిని ఎలుకల మందు దాగినట్లు తోటి విద్యార్థినులు గమనించి, నిర్వాహకులకు తెలిపారు. వారు బాలికను ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దసరా సెలవుల తరువాత హాస్టల్‌కు వచ్చిన బాలిక.. ఇంటి మీద బెంగతో ఫోన్ మాట్లాడాలని ఎంత ప్రయత్నించినా వీలు కాలేదని, అందుకే ఇలా చేసిందని సమాచారం. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు తెలిసింది.

### గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి



సైదులు (ఫైల్)

**దుమ్ముగూడెం/భద్రాచలంఅర్బన్:** భద్రాచలం నుంచి వెంకటాపురం వెళ్తున్న భద్రాచలం ఆర్టీసీ డిపో కండక్టర్ డి.సైదులు (55) గుండెపోటుతో మృతి చెందాడు. భద్రాచలం నుంచి గురువారం వెంకటాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ములకపాడు వద్దకు చేరగానే సైదులుకు ఛాతి నొప్పి రావడంతో బస్సులోనే ఉన్న పర్ణశాల డాక్టర్ రేణుకారెడ్డి, మరో నర్స్ ములకపాడు వైద్యశాల దగ్గర బస్సు నిలిపారు. అనంతరం సైదులును ఆస్పత్రిలోకి తీసుకెళ్లగా డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి సీపీఆర్ చేశాక భద్రాచలం తరలించేసరికి సైదులు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, సైదులు స్వస్థలం ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడు కాగా, ఆయన మృతిపై డీఎం జంగయ్య, ఆర్టీసీ సీఐ రామయ్య, ఉద్యోగులు సంతాపం తెలిపారు. అలాగే, ఆయన అంత్యక్రియలకు డీఎం జంగయ్య రూ.30 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

### చెరువులో పడి వ్యక్తి..

**బూర్గంపాడు:** మతిస్థిమితం లేని వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన గురువారం సారపాకలోని తాళ్లగొమ్మూరులో చోటుచేసుకుంది. మేడేకాలనీకి చెందిన ధరావత్ నందనాయక్ (40) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన రాత్రి వరకు రాలేదు. గురువారం తాళ్లగొమ్మూరులోని చెరువులో మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి నందనాయక్‌గా గుర్తించారు. నందనాయక్‌కు అప్పుడప్పుడూ ఫిట్స్ వస్తాయని, చెరువులోకి దిగినప్పుడు ఫిట్స్ వచ్చి మునిగి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి భార్య లీల ఫిర్యాదు మేరకు అదనపు ఎస్ఐ నాగభిక్షం కేసు నమోదు చేశారు.



రోజుకు 5 నుండి 7 గంటలు తలను ఫోన్ ముందు వంచి గడపడాన్ని 'టెక్స్ట్ నెక్' అని పిలుస్తున్నారు. టెక్స్ట్ నెక్ అనేది మెడలోని కండరాలు, నరాలను ఒత్తిడికి గురి చేస్తుంది. ఒక వ్యక్తి గంటల తరబడి ఫోన్ ముందు వంగి ఉండడం వల్ల అది వెన్నుపూసల మధ్య డిస్క్‌లపై మూడు నుంచి అయిదు రెట్లు ఎక్కువ ఒత్తిడి కలిగిస్తుందంటున్నారు వైద్యనిపుణులు.







- 'సాక్షి' ఫ్యామిలీతో మహిళా ఐపీఎస్‌ల మనోగతం

# అమ్మ... నాన్న... నాలుగో సింహం

అణువంత ప్రోత్సాహంతో అంతులేనన్ని విజయాలు సాధిస్తామని నిరూపించారు. అపజయాలెన్ని ఎదురైనా వెరవకుండా లక్ష్యాన్ని సాధించి చూపారు. అమ్మానాన్నలు ఇచ్చిన ప్రోత్సాహం.. భరోసాతో దేశంలోనే అత్యున్నత సర్వీస్‌లలో ఒకటైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఓ కూతురు కండక్టర్ అయిన తన తండ్రి కల నెరవేర్చితే... మరో కూతురు తన తండ్రి నుంచి పొందిన స్ఫూర్తితో సమాజ సేవకు సిద్ధమైంది. అమ్మ అండతో సాటి మహిళలకు భరోసాగా నిలిచే పోలీస్ అధికారి అవుతానని మరొకరు నిరూపించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 174 మందిలో 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్) బ్యాచ్ ఐపీఎస్ అధికారులు నేడు నిర్వహించనున్న పాసింగ్ ఔట్‌పరేడ్‌తో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్‌లోని ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల మనోగతం... వారి మాటల్లోనే...

### అమ్మ ఇచ్చిన భరోసాతోనే ముందుకు వెళ్లా!
- జయశర్మ

నేను ఐపీఎస్ అధికారి అయ్యానంటే అందుకు వందశాతం మా అమ్మే కారణం. నేను ఓటమి పాలైన ప్రతిసారి నాలో ధైర్యాన్ని నింపింది అమ్మ. ఒత్తిడిలో కూరుకుపోయిన ప్రతిసారీ నాకు భరోసా ఇచ్చి నన్ను ఇక్కడివరకు నడిపింది మా అమ్మ నీతూశర్మే. నా పేరు జయశర్మ. నా స్వస్థలం హర్యానాలోని హిస్సార్. మా నాన్న ప్రమోద్ కుమార్ శర్మ. నాన్న డిస్ట్రిక్ట్ ఫుడ్ సప్లై కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. నేను ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ మ్యాథ్స్ ఆనర్స్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేశాను. నాకు ఐపీఎస్ కావాలని చిన్ననాటి నుంచే కల. అమ్మ ప్రోత్సాహం, నాన్న అండతో నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత సివిల్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టా. ఇది ఎంతో కష్టమైన పని. కొన్నిసార్లు మనపై మనం నమ్మకాన్ని కోల్పోతాం. ఇది మన వల్ల కాదనిపిస్తుంది. అలాంటప్పుడు మనల్ని ప్రోత్సహించేవాళ్లు, భరోసా ఇచ్చేవాళ్లు ఎంతో అవసరం. నేను కూడా మూడుసార్లు సివిల్స్‌కి ఎంపిక కాకపోయినా నిరుత్సాహ పడలేదు. తప్పులు సరిచేసుకుంటూ ముందు వెళ్లా. ఐపీఎస్ ఎలాగైనా సాధించాలన్న నా పట్టుదలకు తోడు నా కుటుంబం, స్నేహితులు అండగా నిలిచారు. నాల్గో ప్రయత్నంలో నేను అనుకున్నట్టుగానే ఐపీఎస్‌కి ఎంపికయ్యాను.

నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పూర్తిగా భిన్నమైంది. నేను ఎన్‌పీఏలోకి రాకముందు కనీసం వంద మీటర్లు కూడా పరిగెత్తినట్టు గుర్తు లేదు. కానీ ఇక్కడ శిక్షణతో ఇప్పుడు ఒంటిపై బరువు, చేతిలో రైఫిల్‌తో 40 కిలోమీటర్లు కూడా రన్నింగ్ చేసేంత స్థైర్యం వచ్చింది. మహిళా ఐపీఎస్ అధికారిగా మహిళా భద్రత, సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతాను.

### నాలుగుసార్లు ఓడినా.. నాన్న ప్రోత్సాహం తగ్గలేదు
- అశ్విని.ఎస్

మా స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి. నాన్న బస్ కండక్టర్‌గా పనిచేసి ఈ ఏడాది రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. మా అక్క ప్రైవేటు ఉద్యోగిని. మేం ఇద్దరమూ అమ్మాయిలమే అయినా.. నాన్న మమ్మల్ని అన్నింటిలో ప్రోత్సహించేవారు. నేను అన్నా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రభుత్వ అధికారిగా ఉంటేనే సమాజానికి దగ్గరగా పనిచేయవచ్చని నాకు మొదటి నుంచి ఉండేది. అందుకే ఇంజినీరింగ్ తర్వాత ప్రైవేటు ఉద్యోగాలవైపు వెళ్లలేదు. తమిళనాడులో స్టేట్ జీఎస్టీ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశాను. కానీ.. నన్ను ఐపీఎస్ ఆఫీసర్‌ను చేయాలన్నది నాన్న కల. అయితే సివిల్స్‌కు ఎంపిక కావడం అంత సులువేం కాదు. ఐదో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించానంటే నాన్న ఇచ్చిన ప్రోత్సాహమే కారణం. ఎప్పటికప్పుడు గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, వ్యక్తిగతంగా నోట్స్ తయారు చేసుకుంటూ నా ప్రయత్నాన్ని కొనసాగించాను. చివరికి విజయం దక్కింది. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశంతోపాటు మనలో ఉన్న సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనింగ్. ఈ శిక్షణ తర్వాత నేను ఎంతో భరోసాగా చెప్పగలను – పోలీస్ ఉద్యోగం మహిళలు కూడా ఎంతో బాగా చేయగలరని! మా బ్యాచ్‌లో కూడా 65 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండడమే అందుకు ఉదాహరణ. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకి నా సలహా ఒక్కటే..సివిల్స్ సాధించడం అనేది మీ లక్ష్యం అయితే, ఎన్ని అడ్డంకులు వచ్చినా మధ్యలో వదలొద్దని ముందే నిర్ణయించుకోవాలి. ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలి. అప్పుడు విజయం మనదే.

### నాకు స్ఫూర్తి మా నాన్నే
- కీర్తియాదవ్


నాన్న ఎయిర్‌మెన్‌గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో ఎంతో క్రమశిక్షణ ఉండేది. నా చిన్నప్పటి నుంచి నాన్నను అలా యూనిఫాంలో చూస్తూ పెరగడంతో నాకు కూడా యూనిఫాం సర్వీసెస్ అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. ఆయనే నాకు ఎప్పటికీ స్ఫూర్తి. స్కూలింగ్ పూర్తయి, కాలేజీకి వచ్చాక నాకు స్పష్టత వచ్చింది ఐపీఎస్ అధికారి అయితే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని. అందుకే ఎప్పటికైనా ఐపీఎస్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లా. అయితే గ్జేవియర్స్ కాలేజ్ కోల్‌కతా నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయి తర్వాత నేను మొదటి ప్రయత్నంలో సీఐఎస్ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాను. 2020లో ట్రైనింగ్ చేస్తూనే సివిల్స్ ప్రిపరేషన్ కొనసాగించాను. ఆ తర్వాత ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను. అయినా, ఐపీఎస్ కలను వదల్లేదు. నాల్గో ప్రయత్నంలో నాకు ఐపీఎస్ వచ్చింది. నాన్న ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేయడం.. మొదటి నుంచి ఎంతో క్రమశిక్షణతో పెరగడంతో ఇక్కడి ట్రైనింగ్ కష్టంగా అనిపించలేదు. సులువుగానే శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ నేర్చుకున్న విషయాలు వృత్తిగతంగానే కాకుండా వ్యక్తిగతంగా నన్ను ఎంతో మార్చాయి. నాకు తెలంగాణ పోలీసులో మహేశ్ భగవత్ ఇన్‌స్పిరేషన్. ఐపీఎస్ అధికారిగా నేను మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. నేను హర్యానాలో పుట్టిపెరిగాను. అక్కడి పరిస్థితులు చూశాక..మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైమ్ రిపోర్టర్, సాక్షి హైదరాబాద్
ఫొటోలు : ఏ. జాన్

● నయా వంచన | డిజిటల్ మోసాలు

## పండగ రోజులు కదా... ఎర వేస్తారు!

స్టే స్మార్ట్ స్టే సేఫ్




పండగ కదా.... ఆన్‌లైన్ షాపింగ్ ప్రయత్నాలలో ఉన్నప్పుడు 'ఫ్రీ దీపావళి గిఫ్ట్' అంటూ పాపప్ కనిపించవచ్చు. 'ఈ ప్రశ్నలకు జవాబు చెప్పి దీపావళి బహుమతులు గెలుచుకోవచ్చు' అనే ప్రకటన మెరుపులా మెరియవచ్చు.

దీపావళిని పురస్కరించుకొని దుస్తుల నుంచి వస్తువుల వరకు ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసగాళ్లకు చేతినిండా పనే!

పండగ రోజుల్లో ఆన్‌లైన్ స్కామ్‌లు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. నకిలీ ఈ-మెయిల్స్, టెక్ట్స్, కాల్స్ ద్వారా స్కామ్‌లు జరుగుతుంటాయి. ఈ పండగ సీజన్‌లో మోస్ట్ కామన్ స్కామ్... నకిలీ ఆర్డర్ లేదా అకౌంట్. మీ అకౌంట్ తాత్కాలికంగా నిలిపివేయబడిందని, ఆర్డర్‌కు పేమెంట్ వెరిఫికేషన్ అవసరమని పేర్కొంటూ హానికరమైన లింక్‌లను క్లిక్ చేసేలా, వ్యక్తిగత వివరాలు షేర్ చేసే విధంగా కస్టమర్‌లను ప్రేరేపిస్తారు.

'గత సంవత్సరం 55,000 ఫిషింగ్ వెబ్‌సైట్‌లను, 12,000 స్కామ్ ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాం. పండగ సీజన్ ముందు ఆన్‌లైన్ స్కామ్‌లపై వినియోగదారులకు అవగాహన కలిగించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్‌తో కలి పనిచేశాం' అన్నారు అమెజాన్ ఇండియా, వైస్ ప్రెసిడెంట్ (లీగల్) రాకేష్ బక్షీ.

'స్కామర్‌లు నకిలీ షాపింగ్ వెబ్‌సైట్‌లను లేదా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి ప్రసిద్ధ బ్రాండ్‌లను అనుసరించి ఆన్‌లైన్ ప్రకటనలను సృష్టిస్తారు. నమ్మశక్యం కాని డిస్కౌంట్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. పరిమిత కాల ఆఫర్‌లతో కస్టమర్‌లను ఆకర్షిస్తారు. ఒక కస్టమర్ ఆర్డర్ చేసి చెల్లింపు చేసిన తర్వాత నకిలీ ప్రాడక్ట్స్ అందుతాయి. అసలు ఏమీ అందకపోవచ్చు కూడా. నకిలీ వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక బ్రాండ్ లోగోలు, ప్రాడక్ట్ ఇమేజ్‌లను, చట్టబద్ధమైన సైట్‌లను తలపించేలా పాలిష్ చేసిన డిజైన్‌లను ఉపయోగిస్తాయి. కొందరు నిజమైన వెబ్‌సైట్‌ల లేఅవుట్, డొమైన్ పేరును కూడా క్లోన్ చేస్తారు. తేడాను గుర్తించడం కష్టంగా ఉంటుంది' అంటున్నారు సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ శుభంసింగ్.

చాలామంది స్కామర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ 'గివ్ అవే' పోటీలు లేదా లక్కీ డ్రాల గురించి పోస్ట్ చేస్తారు. మీ బ్యాంక్ వివరాలను షేర్ చేయమని లేదా క్లెయిమ్ యువర్ ప్రైజ్ లింక్‌పై క్లిక్ చేయమని అడగవచ్చు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దు.

అనుమానాస్పద ఎకౌంట్‌ల గురించి వెంటనే రిపోర్ట్ చేయండి. బ్లాక్ చేయండి. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి.

## స్త్రీ హెల్త్‌పై దృష్టిపెట్టాలి


కృతిసనన్

చలం, అంబేద్కర్‌ల నుంచి నటి, ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) జెండర్ ఈక్వాలిటీకి ఈ దేశపు రాయబారి కృతిసనన్ దాకా అందరి మాటా ఒకటే స్త్రీ ఆరోగ్యమే దేశ భవిష్యత్ భాగ్యం అని!

నిజానికి మహిళా ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి మాట్లాడుకోవడానికి ప్రత్యేక సందర్భం అక్కర్లేదు.. అయినా ఈ ప్రస్తావనకు ప్రత్యేక సందర్భమూ ఉంది. అదే బెర్లిన్ (జర్మనీ)లో జరిగిన వరల్డ్ హెల్త్ సమ్మిట్ 2025. ఇందులో ఆమె మహిళల ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఇలా వరల్డ్ హెల్త్ సమ్మిట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కీర్తి గడించారు. ఆ ప్రసంగంలో కీర్తి సనన్ ఏం మాట్లాడారంటే..

'మహిళల ఆరోగ్యం నిర్లక్ష్యం చేయాల్సిన లేదా పక్కన పెట్టాల్సిన విషయం కాదు. తక్షణమే దృష్టిపెట్టాల్సిన అత్యంత అవసరమైన అంశం. ఆమె ఆరోగ్యం.. మానవాళి ప్రగతికి, భవిష్యత్‌కు మూల స్తంభం. అందుకే మహిళా ఆరోగ్యానికి సంబంధించి సుస్థిరమైన పెట్టుబడులు కావాలి. ఆవిష్కరణలు జరగాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం అద్భుతమైన ఆర్థిక, సామాజిక మార్పులుగా ప్రతిఫలిస్తుంది. ఏటా ముప్పై కోట్లు ఇన్వెస్ట్ చేస్తే పదమూడు వందల కోట్ల రాబడి కనిపిస్తోంది. అంటే దాదాపు తొమ్మిది రెట్ల లాభం. ఈ ఇన్వెస్ట్‌మెంట్ నైతికావసరమే కాదు మన మూకుమ్మడి భవిష్యత్‌కు భరోసా కూడా! ఎందుకంటే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం.. ఆరోగ్యంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన సమాజం ఆర్థిక సుస్థిరతకు చిహ్నం. కానీ ప్రపంచ జనాభాలో సగంగా ఉన్న మహిళల ఆరోగ్యం ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. యూఎన్ఎఫ్‌పీఏ జెండర్ ఈక్వాలిటీ అంబాసిడర్‌గా చాలా ప్రాంతాలు తిరిగాను. అవన్నీ కూడా బాల్యవివాహాలకు సాక్ష్యంగా కనపడ్డాయి. అమ్మాయిలకు మానసిక ఆరోగ్యం సంగతి అటుంచి కనీసం శారీరక ఆరోగ్య కేంద్రాలు కూడా అందుబాటులో లేని దుస్థితిలో ఉన్నాయి. వీళ్ల జీవితాలు మారాలంటే మహిళల ఆరోగ్యానికి సంబంధించి దృష్టి పెరగాలి. తక్షణమే ఆ దిశగా కార్యాచరణ నిర్ణయాలు జరగాలి' అన్నారు కృతిసనన్.

ఫ్యాషన్

పండగలకు, సంప్రదాయి వేడుకలకూ నిండైన హుందాతనాన్ని తీసుకువచ్చేలా
కట్టూ బొట్టు విషయంలో అతివలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు.
ఈ దీపావళి వేళ మరింత స్పెషల్‌గా కనిపించాలనుకునే వారికోసం
బెంగాలీ చీరకట్టు ఆధునికతనూ అద్దుకొని కొంగొత్తగా మెరిసిపోతుంది.
సెలబ్రిటీలూ ముచ్చటపడే ఈ కట్టుకు వారు జోడించే హంగులు ఇవి...

## పండగంతా నిండుగా...



పండగలు, ఇతర సంప్రదాయ వేడుకలలో బెంగాలీ స్టైల్ చీర కట్టును దేశవ్యాప్తంగా మహిళలు ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఉత్తేజాన్ని కలిగించే ఎరుపు-తెలుపు కాంబినేషన్‌లో ఉండే ఈ చీర కట్టు, నుదుటన పెద్ద బిందీ, శంఖం ఆకృతిలో నెక్ డిజైన్, చీర పల్లూకున్న అందమైన డిజైన్.. ఇవన్నీ పండుగను మరింత ప్రత్యేకంగా చేస్తాయి. దుర్గాపూజల సమయాల్లో ఈ రంగు చీరలను బెంగాలీలు ప్రత్యేకంగా ధరిస్తారు. ఆ స్టైల్ కట్టును ఇప్పుడు లక్ష్మీ పూజలు, వివాహ వేడుకల సమయాల్లో ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఈ కట్టును మనం అనుసరించాలంటే మాత్రం ఈ సూచనలు తప్పక అవసరం.

### హెయిర్ స్టైల్- మేకప్
హెయిర్ స్టైల్ కోసం ఒక బన్ తయారు చేసి, దానిని మల్లె పువ్వులు లేదా ఎరుపు, తెలుపు పువ్వులతో అలంకరించవచ్చు. పువ్వులతో కాకున్నా హెయిర్ బన్‌కు హెయిర్ పిన్ జ్యువెలరీని జోడించడం ద్వారా అందాన్ని పెంచుకోవచ్చు. మేకప్ కోసం ఎరుపు లిప్‌స్టిక్, తేలికపాటి ఐ మేకప్ సరిపోతాయి. ధరించిన చీరకు మేకప్ సెట్ అవుతుందా అనేది సరి చూసుకుంటే చాలు. మెడలోనూ, చేతులకు ఎక్కువ నగల లేకుండా చూసుకుంటే చాలు. మీ రూపం ఆధునికతను అద్దుకున్న సంప్రదాయంతో కొంగొత్తగా మెరిసిపోతుంది.



### ఎంపికలో సరైన చీర
పూజలు, నోములు, వ్రతాల సమయంలో ఎరుపు అంచుతో ఉన్న తెలుపు లేదా ఆఫ్-వైట్ బేస్ చీరను ఎంచుకోవాలి. అంచు ఉన్న కాటన్, పట్టు లేదా టస్సర్ చీరలు ఈ బెంగాలీ లుక్‌కు సరైనవి. వీటిలో మన్నైన చేనేతలు కూడా ఉండవచ్చు. ఈ చీరకట్టు సౌకర్యంగా ఉండటమే కాకుండా పూజ, పండగల సమయాల్లో రోజంతా ధరించడం సులభం కూడా.





### కట్టుతో కట్టడి
బెంగాలీ స్టైల్‌లో నిజమైన ఆకర్షణ దాని డ్రేపింగ్ శైలిలోనే ఉంటుంది. చీర కుచ్చిళ్ల నుంచి ఎడమ వైపుగా, పొడవాటి పల్లూను ఛాతీ మీదుగా భుజం వరకు తీసుకుంటూ వెళ్లాలి. పొడవాటి పల్లూ భాగాన్ని కుడి చేతి భుజం కిందుగా తీసి, పైకి అంచు భాగం కనిపించేలా బ్లౌజ్‌కు జత చేయాలి. పొడవుగా తీసుకున్న కొంగు భాగాన్ని కుడి చేత్తో ముందుకు తీసుకువచ్చి పట్టుకోవడం కూడా ఈ కట్టులో అందంగా కనిపిస్తుంది. భుజం మీదుగా తీసిన పల్లూని కొప్పుకు అటాచ్ చేసి, ఎడమ భుజం కిందుగా తీసుకురావచ్చు. ఈ కట్టు లలనల రూపాన్ని మరింత సంప్రదాయంగా మారుస్తుంది. డ్రేపింగ్ చేసేటప్పుడు, కుచ్చుల భాగం మడతలు లేకుండా సెట్ చేసి, పల్లూ చాలా తేలికగా ఉన్నట్టు చూసుకోవాలి.

### నగలపై ప్రత్యేక శ్రద్ధ
పెద్ద పెద్ద చెవిపోగులు, గాజులు, నెక్లెస్‌లు ఈ స్టైల్ చీరకట్టుకు రాయల్ టచ్‌ను జోడిస్తాయి. హెవీగా ఆభరణాలు అక్కర్లేదు అనుకుంటే పెద్ద చెవిపోగులు, గాజులు ఈ అలంకరణకు సరిపోతాయి.

### గుండ్రని వెడల్పాటి బిందీ
బెంగాలీ స్టైల్ డ్రేపింగ్ సంపూర్ణం కావాలంటే నుదుటన పెద్ద, గుండ్రని ఎరుపు బిందీ తప్పక ఉండాలి. ఇది పండుగల రోజుల్లో మొత్తం మేకప్‌ను పూర్తి చేస్తుంది. నుదుటిపై బిందీతో పాటు సిందూర్ చుక్కలను కూడా అదనంగా పెట్టడం వల్ల లుక్ మరింత మెరుగవుతుంది. ఈ లుక్‌కి ఎరుపు లేదా ముదురు గులాబీ రంగు బిందీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● టెక్నాలజీ

## ఇంటిపని నుంచి తోటపని వరకు... ఫిగర్ వో 3



'ఫిగర్ ఏఐ' అనేది హ్యూమన్ రోబోలకు సంబంధించిన స్టార్టప్. తాజాగా 'ఫిగర్ వో 3' అనే హ్యూమన్ రోబో గురించి ప్రకటించింది కంపెనీ. 'రోజువారీ అవసరాలకు ఉపయోగపడే సాధారణ హ్యూమనాయిడ్ రోబో ఇది. గదిని శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పెట్టడం, ఆహారాన్ని వడ్డించడం, గిన్నెలు కడగడం, బట్టలు మడత పెట్టడం...మొదలైన ఎన్నో పనులు చేస్తుంది' అని 'ఫిగర్ వో 3' వివరాలు వెల్లడి చేసింది కంపెనీ. కాలిఫోర్నియాకు చెందిన 'ఫిగర్ ఏఐ' స్టార్టప్ మునుపటి తరం హ్యూమనాయిడ్‌లతో పోల్చితే సరికొత్త, సాంకేతికంగా ఒక అడుగు ముందుండే హ్యూమనాయిడ్స్ దృష్టి పెట్టింది. పూర్తిగా రీడిజైన్ చేసిన సెన్సరీ సూట్, హ్యాండ్ సిస్టమ్, నెక్స్ట్ జనరేషన్ విజన్ సిస్టమ్‌తో ఈ సరికొత్త హ్యూమనాయిడ్ రోబో మార్కెట్‌లోకి అడుగు పెట్టనుంది.

బులియన్
బంగారం 10 గ్రా.। వెండి కిలో
అక్టోబర్ 16న ముగింపు రూ.లలో

| హైదరాబాద్ | | విజయవాడ | | విశాఖపట్నం | | రాజమండ్రి | | ప్రొద్దుటూరు | | చెన్నై | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,31,900 | బంగారం (24 క్యారెట్లు) | 1,31,320 | బంగారం (24 క్యారెట్లు) | 1,29,440 | బంగారం (24 క్యారెట్లు) | 1,31,320 | బంగారం (24 క్యారెట్లు) | 1,31,300 | బంగారం (24 క్యారెట్లు) | 1,29,810 |
| బంగారం (22 క్యారెట్లు) | 1,22,790 | బంగారం (22 క్యారెట్లు) | 1,18,650 | బంగారం (22 క్యారెట్లు) | 1,18,650 | బంగారం (22 క్యారెట్లు) | 1,22,210 | బంగారం (22 క్యారెట్లు) | 1,20,800 | బంగారం (22 క్యారెట్లు) | 1,19,000 |
| వెండి | 1,90,000 | వెండి | 1,82,900 | వెండి | 2,06,000 | వెండి | 1,82,900 | వెండి | 1,80,000 | వెండి | 2,06,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.